# ఎవరి అంచనాలు వారివే

- తమదే విజయం అంటూ అన్ని పార్టీల అభ్యర్థుల ధీమా
- బూత్‌ల వారీగా తమకు వచ్చిన ఓట్లపై ఆరా
- ఏయే ప్రాంతాల్లో ఆధిక్యం వస్తుందనే అంచనా
- ఎవరికి వారుగా విశ్లేషణలు
- ఈవీఎంలలో ఓటరు తీర్పు నిక్షిప్తం
- ఆదివారం ఓట్ల లెక్కింపు.. మధ్యాహ్నానికే ఫలితాలు

బడంగ్‌పేట, డిసెంబర్ 1: మహేశ్వరం నియోజకవర్గం గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా గెలుపు ఓటములపై తెగ చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో ఎవరిని కదిలించినా అదే చర్చ జరుగుతుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల జాతకాలపై అనుచర గణం జోష్యం చెప్పించుకుంటున్నారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో ఉన్న ఓటర్ మహాశయులు ఇచ్చే తీర్పుపై విశ్లేషనలు చేయించుకుంటున్నారు. వివిధ సంస్థలు ఇస్తున్న ఎగ్జిట్ పోల్ సర్వేలపై చర్చలు జరుపుతున్నారు. పార్టీలకు ఉన్న బలాబలాలపై అంచనాలు వేసుకొని ఓట్టింగ్ సరళిని సమీక్షించుకుంటున్నారు. నాయకులు నెల రోజులుగా చేసిన విస్తృత ప్రచారం ఓటర్ చెవికి ఎక్కిందా లేదా అన్న కోణంలో ఎవరికి వారు ఆత్మపరిశీలనలో పడ్డారు. విశ్లేషకులతో చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో ఉన్న 5,46,577 ఓటర్లకు కాగాను 56 శాతం మాత్రమే పోలింగ్ కావడంతో అంచనాలకు అవకాశం లేకుండా పోయిందని చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి అభివృద్ధిని నమ్మకొని ప్రచారం చేసి ఓటర్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ బీసీ, స్థానికతపై నమ్మకం పెట్టుకొని ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నియోజకవర్గానికి కొత్తకావడం వలన చెప్పుకోవడానికి అంశాలు ఏం లేకపోవడంతో మార్పు కావాలని ప్రచారం చేశారు. నియోజకవర్గం ప్రజలు మాత్రం ఎవరు ఎన్ని ఆశలు చూపినా అభివృద్ధికి ఓటు వేశామని చెప్పుకొస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వేవ్ వచ్చిందని చెప్పుకొచ్చిన్నప్పటికీ నియోజకవర్గం ఓటర్లు పెద్దగా పట్టించుకోన్నట్లు కనిపించింది. ఈవీఎంలలో నిక్షిప్తం అయిన అభ్యర్థుల జాతకాలు ఈనెల 3న వచ్చే ఫలితాల్లో తేలనుంది. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధికి ప్రజలు ఓట్లు వేశారని మరోసారి బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వనున్నారని బీఆర్‌ఎస్ శ్రేణులు విశ్వాసంగా ఉన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల ఓటు బ్యాంక్ దాదాపుగా బీఆర్‌ఎస్‌కు వేశారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## శివగంగ దేవాలయంలో కార్తిక మాస పూజలు

మహేశ్వరం, డిసెంబర్ 1: మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శివగంగ దేవాలయంలో కార్తిక మాసంలో భాగంగా లక్ష దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దేవాలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఈవో మురళీకృష్ణ తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ దీపారాధన కార్యక్రమంలో రోజుకు 3500 దీపాలను వెలిగిస్తామని.. నెల రోజుల పాటు లక్ష దీపాలను వెలిగించడం జరుగుతుందని తెలిపారు.


**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT; AT : L.B.NAGAR**
**O.S.NO. 576 OF 2023**

**Between:**
Smt. Kavati Padma & Others ...Plaintiffs
**AND**
The Commissioner, Municipal Corporation, Badangpet & Others ...Defendants

**SUMMONS**

To
**All concerned to whom so ever** ...Defendants

Whereas the above named Plaintiffs have filed the above suit in for Declaration of Legal heirs of Late Kavati Yadaiah and the same was posted to 07-12-2023 for appearance of interested persons who are having objections in this regard. Hence, the interested persons who are having objections in declaring the legal heirs of said Kavati Yadaiah, they may appear before the Hon'ble Court on **07-12-2023 at 10-30 A.M.** either person or through Advocate, failing which the matter will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT //
**M.V. RAMCHANDER RAO**
Advocate
Badangpet, Hyderabad-500 058.
Counsel for the Plaintiffs


# గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

మణికొండ, డిసెంబర్ 1: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో గురువారం జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికల్లో గెలిచేది ఎవరనే అంశంపై అభ్యర్థులు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పోటీలో నిలువగా గురువారం ఎన్నికలు పూర్తి కావడంతో శుక్రవారం అభ్యర్థులు తామే గెలుస్తామంటూ చెప్పుకొంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ చూసినా ఎవరు గెలుస్తారోనన్న అంశం చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఇదిలావుంటే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓటింగ్ శాతం ఎంత? ఏ బూత్‌లో ఎంత శాతం పోలింగ్ జరిగింది? అనే అంశాలపై విపరీతమైన చర్చలు జరిగాయి. మరికొందరు 3వ తేదీ వరకు వేచి చూడాల్సిందే అని చెప్పుకొచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో 2014 శాసనసభ ఎన్నికల్లో 59.40 శాతం పోలింగ్ నమోదు, 2018 ఎన్నికల్లో 56.80 శాతం పోలింగ్ నమోదైయింది. 2023 ఎన్నికల్లో 55.83 పోలింగ్ నమోదైంది. దీంతో అభ్యర్థులు తమ గెలుపు ఓటములపై అంచనా వేసుకుంటూ ఏఏ బూత్‌లల్లో అధికశాతం ఓటింగ్ జరిగింది. ఎక్కడ తమకు అనుకూలమైన ఓట్లు పడ్డాయనే అంశాలపై తమ అనుచరులతో చర్చలు జరుపుకొంటూ గెలుపు అంచనాలు వేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో చాలా చోట్ల ఓట్లు గల్లంతు కావడంతో పోలింగ్‌శాతం గతం కంటే తక్కువ నమోదు కావడం కొంతమంది అభ్యర్థుల భవితవ్యాన్ని తారుమారు చేసే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో త్రిముఖపోటీని కొనసాగించడంతో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. మరో 48 గంటల్లో అభ్యర్థుల భవితవ్యం వెలువడే అవకాశం ఉండటంతో ఎవరైనా వేచి చూడాల్సిన పరిస్థితే.

## కీలకం కానున్న శంషాబాద్ ఓట్లు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1: రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్లు 87,256మంది ఉండగా 62,783 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తంలో 74.77 శాతం నమోదు కావడంతో ఎమ్మెల్యే అభ్యర్థుల ఆశలు శంషాబాద్ ఓట్లపైనే ఉన్నాయి. శంషాబాద్ మండలంలోని పాలమాకుల, పెద్దషాపూర్, నర్కూడ గ్రామాల్లో అధికంగా ఓటర్లు ఉండటంతో ఆయా గ్రామాలే కీలకం కానున్నాయి. మూడు గ్రామ పంచాయతీల్లో అధికంగా ఓట్లు ఎవరికి పోలైతే వారినే గెలుపు వరిస్తుందని ఆయా పార్టీల నాయకులు ధీమాతో ఉన్నారు. దీంతో పాటు మీగతా పంచాయతీల్లో సైతం 90శాతం ఓట్లు పోలయ్యాయి. గ్రామాల్లో అధికంగా ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలో సైతం గొల్లపల్లి, తొండుపల్లి, ఊటుపల్లి, సాతంరాయి, కొత్వాల్‌గూడలలో అధికంగా ఓట్లు నమోదయ్యాయి, మిగతా వార్డుల్లో తక్కువగా ఓట్లు నమోదయ్యాయి. 74.77 శాతం ఓట్లు పోలింగ్ కావడంతో అభ్యర్థుల ఆశలు శంషాబాద్‌పైనే ఉన్నాయి. దీంతో ఎవరికి వారే ధీమాగా ఉన్నారు.

### మూడుసార్లు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు మెజార్టీ ఇచ్చిన శంషాబాద్ ఓటర్లు

2009 నుంచి వరుసగా జరిగిన ప్రతి ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు 2009లో 5వేల పైగా మెజార్టీ ఇచ్చిన ఓటర్లు 2014లో జరిగిన ఎన్నికల్లో సైతం 15వేలకు పైగా మెజార్టీ ఇచ్చాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ ప్రజలు తమకే మద్దతుగా ఉన్నారని ఎమ్మెల్యే అనుచరులు ధీమాగా ఉన్నారు. దీంతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు కొత్తవారు అయిన శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ ప్రజల ఓట్లు తమకే మద్దతుగా ఉన్నట్లు ఆయా పార్టీలకు చెందిన నాయకులు ధీమాగా చేబుతున్నారు. ఇది ఇలా ఉండగా ఆదివారం తుది ఫలితాలు వచ్చే వరకు ఎవరికి వారే గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ బాద్‌షా ఎవరనేది తెలనుంది.

## రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆహారాన్ని తీసుకోవాలి



ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి.డి.ఇందిర

ఆర్కేపురం, డిసెంబర్ 1 : రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర, చేయూత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సరూర్‌నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి భరోసానిచ్చేందుకు, ప్రజల్లో ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబర్ 1న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈసారి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాలను అసమానతలను అంతం చేయండి, ఎయిడ్స్‌ను అంతం చేయండి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. డబ్ల్యూహెచ్ఓ దాని అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో అనేక రోగాలకు మందులు, చికిత్సలు కనుకొన్నా ఎయిడ్స్‌కు మాత్రం ఇంకా మందు అందుబాటులోకి రాలేదన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కొన్ని చికిత్స విధానాలతో వ్యాధి పూర్తిగా నయం కాదు కానీ, వ్యాధి సంక్రమించకుండా నిరోధించవచ్చని చెప్పారు.

# రేపే కౌంటింగ్..

- లార్డ్స్ కళాశాల వద్ద ఏర్పాట్లు పూర్తి
- పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 29 కౌంటర్లు 20 రౌండ్లు




లార్డ్స్ కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

బండ్లగూడ, డిసెంబర్ 1: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం జరిగిన ఓటింగ్‌కు సంబంధించిన ఈవీఎంలను గండిపేట మండలం పరిధిలోని హిమయాత్ సాగర్ లార్డ్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో అధికారులు భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద బలగాల పోలీసులను మోహరించారు. షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు సంబందించిన ఎన్నికల కౌంటింగ్ లార్డ్స్ కళాశాలలో నిర్వహించనున్నరు. మొత్తం 28 కౌంటింగ్ టేబుళ్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను 20 రౌండ్లలో కౌంటింగ్ చేసేందుకు సిద్ధం చేశారు. కౌంటింగ్‌కు వచ్చే వారి కోసం నాయకుల వాహనాల పార్కింగ్‌ను కిలో మీటర్ దూరంలో ఏర్పాటు చేశారు.

# గెలుపు మనదే..

- రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి టి.ప్రకాశ్‌గౌడ్
- నాయకులు, కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు

మణికొండ, డిసెంబర్ 1: రెండునెలల పాటు నిర్విరామంగా బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుకోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గులాబీ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు అవిశ్రాంతంగా పాటుపడిన నాయకులకు శుక్రవారం అభ్యర్థి ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికావడంతో పాటు అన్ని సర్వేలు బీఆర్‌ఎస్ విజయం సాధించే దిశగా రావడంతో రాజేంద్రనగర్‌లోనూ అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. గండిపేట, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల పరిధిలోని గతంలో కంటే అత్యధిక మెజార్టీ సాధిస్తామని ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి వచ్చి ఎన్నికల సరళిపై విజయావకాశాలకు సంబంధించిన అంశాలపై చర్చలు సాగించారు. ఏఏ బూత్‌లల్లో ఎంత శాతం ఓటింగ్ నమోదైందనే అంశాలను ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి చర్చించారు. అన్ని ప్రాంతాల్లో అనుకూలమైన ఓటింగ్ నమోదైయిందని కచ్చితంగా అంతటా మంచి మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. ఈసారి అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గుచూపి స్వచ్ఛందంగా ఓట్లు వేశారని నాయకులు తెలిపారు. ప్రకాశ్‌గౌడ్ కనీసం 20-30 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టంచేశారు.

## పూజకు రావాలని మంత్రికి ఆహ్వానం



మహేశ్వరం, నవంబర్ 1: రామచంద్రగూడ తండాలో నిర్వహిస్తున్న అయప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి రావాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డికి రామచంద్రగూడకు చెందిన కాటారం సిద్ధు గురుస్వామి, అయప్ప స్వాములు కోరారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.